సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 27 । జూన్ । 2024



నేడు ట్రయల్ రన్ !

అశ్వాపురం మండలం బీజీ కొత్తూరులో సీతారామ పంప్‌హౌస్ ట్రయల్ రన్ నిర్వహణకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. 8లో



రీజియన్‌లో 620 బస్సులు

ఖమ్మం రీజియన్‌లో ఏడు డిపోల నుంచి 620 బస్సుల్లో ప్రయాణికులకు గమ్యస్థానాలకు చేరవేస్తున్నట్లు ఆర్‌ఎం సరిరామ్ తెలిపారు. 8లో

గరిష్టం / కనిష్టం
30° / 25°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉదయం నుంచే ఆకాశం మేఘావృతమై ఉంటుంది. సాయంత్రానికి కొన్నిచోట్ల జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

కమనీయంగా రామయ్య నిత్యకల్యాణం



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామి వారి నిత్యకల్యాణ వేడుక బుధవారం కమనీయంగా సాగింది. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామి వారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

మంత్రి తుమ్మలను కలిసిన కలెక్టర్, ఎస్పీ



మంత్రి తుమ్మలతో కలెక్టర్, ఎస్పీ

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం కొత్తగూడెంలోని సింగరేణి అతిథి గృహానికి వచ్చిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలెక్టర్ జితేష్ వి పాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్ మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి వారిని ఆప్యాయంగా పలకరించి జిల్లాలోని పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

జిల్లాలో నేడు డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటన

కొత్తగూడెంఅర్బన్/మణుగూరుటౌన్ : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు జిల్లాలో గురువారం పర్యటించనున్నారు. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేస్తారు. అనంతరం గోదావరి వరదలపై చేపట్టాల్సిన ముందుస్తు చర్యలపై కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తారు. ఆ తర్వాత మణుగూరు వెళ్తారు. పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తల్లి ఇటీవల మరణించగా, ఎమ్మెల్యేను పరామర్శిస్తారు. అలాగే పద్మశ్రీ ఆవార్డు గ్రహీత సకిని రాంచంద్రయ్య కుటుంబసభ్యులను కూడా పరామర్శించనున్నారు. భట్టితో పాటు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉదయం 9.30 గంటలకు బేగంపేట విమానాశ్రయం నుంచి బయలుదేరి 10.40 గంటలకు కొత్తగూడెం చేరుకుంటారు. ప్రగతి మైదానంలో వారికి స్థానిక ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తదితరులు స్వాగతం పలుకుతారు. అనంతరం ఆయా కార్యక్రమాల్లో పాల్గొనేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

29న జాబ్ మేళా

పోస్టర్లు విడుదల చేసిన కలెక్టర్



వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కలెక్టర్

కొత్తగూడెంటౌన్/సూపర్‌బజార్(కొత్తగూడెం): కొత్తగూడెం క్లబ్‌లో ఈనెల 29న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళా పోస్టర్‌ను కలెక్టర్ జితేష్ వి పటేల్ తన చాంబర్‌లో బుధవారం ఆవిష్కరించారు. తెలంగాణ సొసైటీ ఫర్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయ్‌మెంట్ ప్రమోషన్(టీజీఎస్‌టీఈపీ) సికింద్రాబాద్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి కె.సంజీవరావు మాట్లాడుతూ.. మొత్తం 60 ప్రైవేట్ కంపెనీలు జాబ్‌మేళాకు వస్తాయని, ఒకటి నుంచి పీజీ వరకు చదివిన నిరుద్యోగులు హాజరు కావచ్చని తెలిపారు. అర్హతకు తగిన ఉద్యోగం కల్పించే అవకాశం ఉంటుందని, వేతనం ఆయా ఉద్యోగాన్ని బట్టి రూ.10 వేల నుంచి రూ.55 వేల వరకు ఉంటుందని వివరించారు. జాబ్‌మేళాకు హాజరయ్యే నిరుద్యోగులు తమ బయోడేటా, సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు. వివరాలను https://forms.gle/aWH1u05 poS6RrT3D6 వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

అద్దె బిల్లులు అందేదెప్పుడో..?



వైద్య కళాశాలను రెండేళ్లుగా వేధిస్తున్న సమస్య

- 2022 నవంబర్‌లో మెడికల్ కాలేజీ ప్రారంభం
- నేటికీ అందుబాటులోకి రాని బిల్డింగ్‌లు
- అద్దె భవనాల్లోనే కొనసాగుతున్న కాలేజీ హాస్టళ్లు
- రూ.కోటికి చేరిన బకాయిలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఏజెన్సీ జిల్లాకు వరప్రదాయనిగా మారిన ప్రభుత్వ మెడికల్ కాలేజీ నిర్వహణ భారంగా మారుతోంది. కళాశాల హాస్టల్ భవనాలకు అద్దె బిల్లులు రెండేళ్లుగా పేరుకుపోవడంతో ఈ పరిస్థితి తలెత్తింది. కరోనా తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా విస్తారంగా వైద్య కళాశాలలు స్థాపించాలని అప్పటి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో జిల్లాకు 2021లో మెడికల్ కాలేజీ మంజూరు చేశారు. అనంతరం కొత్తగూడెంలోని 100 పడకల ఏరియా ఆస్పత్రి, రామవరంలోని మాతా శిశు ఆస్పత్రులను మెడికల్ కాలేజీ పరిధిలోకి తెచ్చారు. ఈ మేరకు ఈ రెండు ఆస్పత్రుల్లో అవసరమైన మార్పులు చేశారు. కాలేజీ తరగతుల కోసం కేఎస్‌ఎం ప్రాంగణంలో హుటాహుటిన భవనాలు నిర్మించారు. అన్ని అంశాలను పరిశీలించిన నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్‌ఎంసీ) 2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించిన అనుమతులు జారీ చేసింది. దీంతో ఆ ఏడాది నిర్వహించిన కౌన్సెలింగ్ ద్వారా 149 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు.

అద్దె భవనాల్లో హాస్టళ్లు..

మెడికల్ కాలేజీకి సంబంధించి హాస్టల్ భవనాల నిర్మాణం పూర్తి కాకపోవడంతో అమ్మాయిలకు పాల్వంచలో, అబ్బాయిలకు నవభారత్ సమీపంలోని మంచికంటి నగర్‌లోని ప్రైవేటు భవనాల్లో తాత్కాలికంగా వసతి ఏర్పాటు చేశారు. మొదటి ఏడాది పూర్తయ్యే సరికి ప్రభుత్వం నిర్మించే హాస్టల్ భవనాలు అందుబాటులోకి వస్తాయనే అంచనాలు ఆరంభంలో ఉండేవి. కానీ ఆ భవనాలు అందుబాటులోకి రాలేదు. ఇంతలో మొదటి ఏడాది పూర్తయి, రెండో బ్యాచ్ అడ్మిషన్లు కూడా పూర్తయ్యాయి. వచ్చే జూలై, ఆగస్టులో వీరు సైతం వార్షిక పరీక్షలు రాయబోతున్నారు. అయినా కళాశాల హాస్టల్ భవనాల నిర్మాణం ఇప్పటికీ పూర్తి కాలేదు.

పెండింగ్‌లో బిల్లులు..

కేవలం ఏడాదిన్నర వ్యవధిలోనే కాలేజీ మంజూరు మొదలు ఆస్పత్రుల అప్‌గ్రేడేషన్, ఎన్‌ఎంసీ నుంచి అనుమతుల వరకు వేగంగా వ్యవహరించిన అప్పటి సర్కారు.. ఆ తర్వాత మెడికల్ కాలేజీ నిర్వహణపై తగినంత శ్రద్ధ చూపలేదు. చేసిన పనులకు సైతం బిల్లులు చెల్లించకపోవడంతో హాస్టల్ భవన నిర్మాణాలను కాంట్రాక్టర్ మధ్యలోనే నిలిపేశాడు. మరోవైపు హాస్టళ్లు కొనసాగుతున్న ప్రైవేటు భవనాలకు అద్దె బిల్లులు మంజూరు చేయలేదు. అమ్మాయిల హాస్టల్‌కు నెలకు రూ. 2.40 లక్షలు, అబ్బాయిల హాస్టల్‌కు నెలకు రూ. లక్ష చొప్పున 19 నెలల అద్దె బకాయి ఉంది. ఇప్పటికే ఈ మొత్తం రూ. 64.60 లక్షలకు చేరుకుంది. మెడికల్ కాలేజీకి అనుబంధంగా మంజూరైన నర్సింగ్ కాలేజీ సైతం అదనపు భవనాల్లోనే కొనసాగుతోంది. ఇది కూడా కలిపితే మెడికల్ కాలేజీ హాస్టళ్ల అద్దె బిల్లు బకాయిలు రూ. కోటి వరకు ఉంటాయి.



విద్యార్థినుల హాస్టల్ కోసం అద్దెకు తీసుకున్న భవనం..

మూడో బ్యాచ్ వస్తోంది..

రూ.కోటి మేర పేరుకుపోయిన మెడికల్ కాలేజీ హాస్టల్ భవనాల అద్దె విషయంలో ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి రెండుసార్లు ప్రతిపాదనలు పంపగా సానుకూల ఫలితం రాలేదు. ప్రస్తుతం మూడో బ్యాచ్ అడ్మిషన్లకు సంబంధించిన ప్రక్రియ ప్రారంభం కానుంది. పాత బకాయిలు చెల్లించకుండా కొత్త వారికి వసతి ఏర్పాట్లు చేయడం ఇబ్బందికరమేనని మెడికల్ కాలేజీ పాలకవర్గాలు అంటున్నాయి. ఈ నేపథ్యంలో హాస్టల్ భవనాల అద్దె చెల్లింపు విషయంలో ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన రావాల్సిన అవసరం ఉంది.

కొత్త చట్టాలపై అవగాహన అవసరం

జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్



మాట్లాడుతున్న జిల్లా జడ్జి పాటిల్‌వసంత్

కొత్తగూడెంటౌన్: కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ అన్నారు. జిల్లా కోర్టు లైబ్రరీ హాల్‌లో బుధవారం నూతన చట్టాలపై న్యాయవాదులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జడ్జి పాటిల్ వసంత్ మాట్లాడుతూ.. నూతన చట్టాలపై అవగాహన కలిగించేందుకు ఇలాంటి శిక్షణ తరగతులను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. దేశ వ్యాప్తంగా జూలై 1 నుంచి అమలు కానున్న నూతన చట్టాలు భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), భారతీయ నాగరిక్ సురక్ష సంహిత (బీఎన్ఎస్ఎస్) భారతీయ సాక్ష్యా అధినియం (బీఎస్ఏ)పై పూర్తి అవగాహన కలిగి ఉండాలని అన్నారు. అప్పుడే బాధితులకు సమర్థవంతంగా న్యాయం చేయగలుగుతామని చెప్పారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాండురంగ విట్టల్ తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రహిత జిల్లాగా మారుద్దాం

మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవంలో కలెక్టర్ పాటిల్



విద్యార్థుల ర్యాలీలో కలెక్టర్ జితేష్, ఎస్పీ రోహిత్‌రాజ్



కలెక్టర్, ఎస్పీ తదితరులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీడబ్ల్యూఓ విజేత

కొత్తగూడెంటౌన్ : కొత్తగూడేన్ని గంజాయి రహిత జిల్లాగా మారుద్దామని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కొత్తగూడెంలో మహిళా శిశు సంక్షేమ శాఖ, సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎస్పీ రోహిత్‌రాజ్‌తో కలిసి ఆయన పాల్గొన్నారు. వందలాది మంది విద్యార్థులు, పోలీసులతో భారీ ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గంజాయి వంటి మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు బానిస కావొద్దని సూచించారు. ర్యాలీకి తరలివచ్చిన యువతను చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. శక్తి వంతమైన జిల్లాగా భద్రాద్రికి పేరుందని, ఈ పేరును చెడగొట్టవద్దని కోరారు. జిల్లాలో మత్తు పదార్థాల నివారణలో పోలీసు శాఖ కీలకంగా పని చేస్తోందని చెప్పారు. పిల్లలు ఏం చేస్తున్నారో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు గమనిస్తూ ఉండాలన్నారు. యువతకు బంగారు భవిష్యత్ ఉందని, కొందరు దుర్వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. ఎస్పీ రోహిత్ రాజ్ మాట్లాడుతూ.. మత్తు పదార్థాల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందన్నారు. డ్రగ్ రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న తరుణంలో మత్తు పదార్థాలను అరికట్టేందుకు తమ శాఖ ఆధ్వర్యంలో చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి జిల్లా మీదుగా జరుగుతున్న గంజాయి రవాణాను సమర్థంగా పట్టుకుంటున్నామని వివరించారు. గత ఆరు నెలల్లో 5000 కేజీల గంజాయిని పట్టుకుని, అక్రమార్కులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. అనంతరం మత్తు పదార్థ రహిత సమాజం కోసం పాటుపడదామంటూ జిల్లా సంక్షేమ శాఖ అధికారి వేల్పుల విజేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ జానయ్య, మున్సిపల్ కమిషనర్ స్వామి, డీఐఈఓ సులోచనారాణి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

డీఎంహెచ్‌ఓ భాస్కర్‌నాయక్



అశ్వాపురం పీహెచ్‌సీలో మాట్లాడుతున్న భాస్కర్ నాయక్

అశ్వాపురం/మణుగూరురూరల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ భాస్కర్‌నాయక్ సిబ్బందికి సూచించారు. అశ్వాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు మణుగూరు శివలింగాపురంలోని పీహెచ్‌సీని బుధవారం ఆయన తనిఖీ చేశారు. పీహెచ్‌సీల్లో రికార్డులు పరిశీలించి ఓపీ, ల్యాబ్, మందుల నిల్వ రిజిస్టర్లను పరిశీలించారు. పీహెచ్‌సీలో ప్రసవాలు, గర్భిణులకు అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అప్రమత్తంగా ఉంటూ తగిన ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. నిర్దేశించిన అన్ని కార్యక్రమాలకు ఇచ్చిన సూచికల ఆధారంగా వంద శాతం పూర్తి చేయాలని వైద్య సిబ్బందికి సూచించారు. పీహెచ్‌సీల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రాజ్‌కుమార్, డీఐఓ బాలాజీనాయక్, పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ సంకీర్తన, శివకుమార్, డిప్యూటీ పారామెడికల్ అధికారి శ్రీనివాసరావు, డాక్టర్లు దుర్గారావు, బాలాజీ, నిశాంత్‌రావు పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి

అదనపు కలెక్టర్ విద్యాచందన



చిన్నారుల యూనిఫాంను పరిశీలిస్తున్న విద్యాచందన

ములకలపల్లి: పాఠశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని అదనపు కలెక్టర్, డీఆర్‌డీఓ విద్యాచందన ఆదేశించారు. మండలంలోని పలు గ్రామాల పాఠశాలల్లో చేపడుతున్న పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా ఆదర్శ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పిస్తున్నట్లు తెలిపారు. మాధారం, సీతారాంపురం. వీకే.రామవరం గ్రామాల్లో నర్సరీలను పరిశీలించారు. కరివేప, మునగ, వేప, చింత జాతుల మొక్కల పంపెంకంపై దృష్టి సారించాలని సూచించారు. అనంతరం మాధారం, సత్యంపేట గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. మాధారంలో కుట్టుమిషన్ సెంటర్‌ను సందర్శించి అంగన్‌వాడీ చిన్నారుల యూనిఫాం త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భారతి, ఎంపీఓ లక్ష్మయ్య, ఏపీఓ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

బొకేలు వద్దు.. నోట్ పుస్తకాలతో రండి

స్ఫూర్తి నింపుతున్న కలెక్టర్ జితేష్



నోట్ పుస్తకాలు అందజేస్తున్న అటవీ అధికారులు

చుంచుపల్లి : మంత్రులు, జిల్లా స్థాయి అధికారులకు బొకేలు, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలపడం సహజం. అయితే వాటికి బదులు తక్కువ ఖర్చుతో ఎక్కువ మంది పేద విద్యార్థులకు ఉపయోగపడేలా నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఇతర సామగ్రి తీసుకుని మాత్రమే రావాలని నూతన కలెక్టర్ జితేష్ వి పాటిల్ సూచించడం అందరినీ ఆలోచింపజేస్తోంది. తనకు అభినందనలు తెలిపేందుకు వచ్చే వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు బొకేలు, పూలదండలు తేవొద్దని, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు వంటివి అందించి పేద విద్యార్థులకు చేదోడువాదోడుగా నిలవాలని సూచిస్తున్నారు. దీంతో ఆయనను కలిసేందుకు వస్తున్న అన్ని వర్గాల వారు నోట్‌పుస్తకాల వంటివి మాత్రమే అందజేస్తున్నారు. వాటిని త్వరలో విద్యార్థులకు పంపిణీ చేసేందుకు కలెక్టర్ రంగం సిద్ధం చేస్తున్నారు.

కెమికల్ సొసైటీ సభ్యుడిగా ఎంపిక

దమ్మపేట : అమెరికన్ కెమికల్ సొసైటీ మెంబర్‌గా మండలానికి చెందిన పెంకె విజయబాబు ఎంపికయ్యారు. మండలంలోని నాగుపల్లి గ్రామానికి చెందిన విజయబాబు రసాయన శాస్త్రంలో డాక్టరేట్ పూర్తిచేసి, పలు మల్టీ నేషనల్ ఫార్మా కంపెనీల్లో సైంటిస్ట్‌గా పనిచేశారు. లండన్ నుంచి ప్రతిష్ఠాత్మక రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీలో మెంబర్‌గా 2023లో ఎంపికయ్యారు. కెమికల్ రీసెర్చ్ విభాగంలో అతడి ప్రతిభ ఆధారంగా అమెరికన్ కెమికల్ సొసైటీ మెంబర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకోగా, ఆ సొసైటీలో మెంబర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు మంగళవారం ధ్రువీకరణ పత్రం తీసుకున్నారు. విజయబాబు ఎంపిక పట్ల మండల వాసులు హర్షం వ్యక్తం చేశారు.

3న విద్యార్థులకు పద్య పోటీలు

కొత్తగూడెంఅర్బన్: నేషనల్ గ్రీన్ కార్ప్స్(ఎన్‌జీసీ) ఆధ్వర్యంలో 8, 9 తరగతుల విద్యార్థులకు జూలై 3న కొత్తగూడెం సింగరేణి ఉన్నత పాఠశాలలో పద్యం, పోస్టర్ మేకింగ్(డ్రాయింగ్) పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటేశ్వరాచారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భూములు–పునరుద్ధరణ, ఎడారీకరణం, కరువు–స్థితి స్థాపకత్వం అనే అంశాలపై పద్యాలు, డ్రాయింగ్ పోటీలు ఉంటాయని వివరించారు. ఒక్కో పాఠశాల నుంచి ఐదుగురు విద్యార్థులకు మాత్రమే అనుమతి ఉంటుందని పేర్కొన్నారు. ఒక విద్యార్థి ఒక అంశంలోనే పాల్గొనాలని తెలిపారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు డీఎస్‌ఓ చలపతిరాజును సంప్రదించాలని తెలిపారు.

శాశ్వత చర్యలేవి?



గోదావరి వరదతో నీటమునిగిన సుభాష్ నగర్ కాలనీ (ఫైల్)

- స్లూయిస్‌ల లీకులు, మోటార్ల మొరాయింపు మామూలే !
- భారీ వర్షం వస్తే రామాలయం చుట్టూ వరదే
- మళ్లీ వర్షాకాలం సీజన్ వచ్చినా మారని అధికారుల తీరు
- గోదావరి వరదలపై నేడు మంత్రుల సమీక్ష

భద్రాచలం: వర్షాకాలం వచ్చిందంటేనే భద్రాచలం ఏజెన్సీ ప్రాంత ప్రజలు గోదావరి వరద భయంతో వణుకుతున్నారు. వరదలతో ప్రతీ ఏడాది ముంపు ప్రాంత ప్రజలు, రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం, అధికారులు అప్పటికప్పుడు హడావిడి, పరామర్శలే తప్ప శాశ్వత పరిష్కార మార్గాలు చూపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. భారీ వర్షం కురిస్తే భద్రాచలం చుట్టూ ముంపు భయం నెలకొంటుంది.

ఆలయం చుట్టూ వరద నీరే..

భద్రాచలంలో చినుకు పడిందంటే చాలు రామాలయం చుట్టుపక్కలతో పాటు నిత్యాన్నదాన సత్రంలోకి వరద నీరు చేరుతుంది. విస్తా కాంప్లెక్స్, పరిసరాల్లోని దుకాణాలు ముంపునకు గురవుతాయి. ఆలయం పడమర మెట్ల వైపు కూడా నీరు చేరడంతో అటు వైపు నుంచి రాకపోకలు నిలిచిపోతున్నాయి. భద్రాచలం పట్టణం నుంచి వర్షపు నీరు, మురుగు నీరు పోయేందుకు ఆధునిక డ్రెయినేజీ సిస్టమ్ లేకపోవడమే దీనికి ప్రధాన కారణమని స్థానికులు అంటున్నారు. ఇక గోదావరి వరద పెరిగిందంటే చాలు విస్తా కాంప్లెక్స్ వద్ద ఉన్న స్లూయిస్‌లను మూసేస్తారు. దీంతో రాత్రికి రాత్రే దుకాణాలు, ఇళ్లలోకి వరద నీరు చేరుతుంది. అప్పటికప్పుడే పిల్లా పాపలు, తట్టా బుట్టా సర్దుకొని పునరావాస శిబిరాలకు తరలివెళ్లే హృదయ విదాకర దృశ్యాలు ప్రతీ సంవత్సరం కనిపిస్తూనే ఉంటాయి. దీనికి ప్రత్యామ్నాయంగా ఆధునిక డ్రెయినేజీ సిస్టమ్ ఏర్పాటు చేయాలని, మురుగునీటిని శుద్ధి చేసే ప్రక్రియను కరకట్ట అవతలి ప్రాంతంలో ఏర్పాటు చేయాలని, లేదా ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని ఇప్పటికే 'సాక్షి' పలుమార్లు కథనాలు ప్రచురించింది. పట్టణ వాసులు కూడా ఇదే డిమాండ్ చేస్తున్నారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

లీకులు, మొరాయింపులు..

గోదావరి వరదల నుంచి భద్రాచలాన్ని కాపాడేందుకు కరకట్ట నిర్మించారు. పట్టణంలోని వరద, మురుగు నీరు గోదావరిలో వదిలేందుకు పలు చోట్ల స్లూయిస్‌లు నిర్మించారు. అయితే కొత్త అశోక్ నగర్ కాలనీ, రాఘవ నిలయం, విస్తా కాంప్లెక్స్, సుభాష్‌నగర్ కాలనీల వద్ద నిర్మించిన స్లూయిస్‌ల లీకేజీతో పట్టణంలోకి వరద నీరు చేరుతోంది. దీంతో అయ్యప్ప నగర్, కొత్త అశోక్ నగర్ కాలనీ, చప్టా దిగువ, సుభాష్ నగర్‌తో పాటు పలు కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. గోదావరి వరద 30 అడుగులు దాటిందంటే ఈ కాలనీ వాసులను పునరావాస శిబిరాలకు తరలించడం పరిపాటిగా మారింది. ఈ స్లూయిస్‌ల లీకేజీకి ఇప్పటివరకు శాశ్వత పరిష్కారం చూపలేదు. ఇక వరదనీరు చేరినప్పుడు గోదావరిలోకి పంపేందుకు స్లూయిస్‌ల వద్ద భారీ మోటార్లు ఏర్పాటుచేస్తుండగా కీలక సమయంలో అవి మొరాయిస్తున్నాయి. దీంతో అధికారులు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఈ సమస్యకు కూడా శాశ్వత పరిష్కారం చూపించడం లేదు. వరదల సమయంలో పునరావాస శిబిరాలుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలను వినియోగిస్తున్నారు. దీంతో విద్యార్థుల చదువులు సక్రమంగా సాగడం లేదు. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వ స్థలంలో శాశ్వత పునరావాస శిబిరాలు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ఇక కూనవరం రోడ్డులో మిగిలి ఉన్న కరకట్ట పొడిగింపు పనులను జూన్‌లోగా పూర్తి చేయాలని స్వయంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించినా ఆ పనులు ఇంకా పూర్తి కాలేదు.

నేడు మంత్రుల ఆధ్వర్యంలో సమీక్ష..

గోదావరి వరదల సమయంలో చేపట్టాల్సిన చర్యలపై గురువారం కొత్తగూడెంలో జిల్లా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, భట్టి విక్రమార్క, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో పాటు ఐటీడీఏ పీఓ రాహుల్‌కు గోదావరి వరదలు కొత్తే. ఈ నేపథ్యంలో జిల్లాపై, ప్రత్యేకించి ఏజెన్సీ ప్రాంతంపై పట్టున్న జిల్లా మంత్రులు ముగ్గురిపైనే ప్రధాన బాధ్యత ఉంటుంది. వరదలపై తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారం చూపేలా ఉన్నతాధికారులకు దిశా నిర్దేశం చేయాలని ఏజెన్సీ వాసులు వేడుకుంటున్నారు. సీఎం రేవంత్ రెడ్డి భద్రాచలం పర్యటనకు వచ్చినప్పుడు పట్టణంలో అభివృద్ధి పనులతో పాటు వరద నుంచి కాపాడే చర్యలపై ప్రణాళిక రూపొందించాలని అధికారులను ఆదేశించారు. కాగా, ఈ సమస్యలన్నీ సీఎం దృష్టికి తీసుకెళ్లి శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

క్లుప్తంగా

జర్నలిస్టుల పిల్లలకు ఫీజు రాయితీ



డీఈఓకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలో వివిధ ప్రైవేట్ పాఠశాలల్లో చదివే జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో రాయితీ కల్పించాలని టీయూడబ్ల్యూ జే (టీజేఎఫ్) జిల్లా అధ్యక్షుడు కల్లోజి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జర్నలిస్ట్ యూనియన్ ప్రతినిధులు డీఈఓ వెంకటేశ్వరాచారికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కావడంతో జర్నలిస్టుల కుటుంబాలు ఎదుర్కొంటున్న ఫీజుల సమస్యను డీఈఓకు వివరించారు. స్పందించిన జిల్లా విద్యాశాఖ అధికారి జర్నలిస్టుల పిల్లలకు ఫీజులో 50 శాతం రాయితీని కల్పిస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేసి యూనియన్ నాయకులకు అందించారు. ఈ కార్యక్రమంలో చంద్ర నరసింహారావు, కొత్త వెంకటేశ్వర్లు, సువర్ణపాక శోభన్‌బాబు, నరసింహారావు, ప్రభాకర్‌రెడ్డి, అబ్రహం, చీమకుర్తి రామకృష్ణ పాల్గొన్నారు.

వేద పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

దుమ్ముగూడెం : మండలంలోని నర్సాపురం గ్రామంలో గల ద్వాదశ జ్యోతిర్లింగ క్షేత్రం చిన్న అరుణాచలంలో జూలై 17 నుంచి వేద పాఠశాలను ప్రారంభిస్తున్నామని ఆలయ వ్యవస్థాపకుడు శివనాగస్వామి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పాఠశాలలో ఉచిత ప్రవేశాలు కల్పిస్తామని, ఉచిత విద్య, భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తామని వివరించారు. ఆధునిక చదువుతో పాటు వేద విద్యను కూడా నేర్చుకునే అవకాశం ఉందని తెలిపారు. వేద పాఠశాలలో అడ్మిషన్లు కావాలనుకునే వారు 9908229103 నంబర్‌లో సంప్రదించి జూలై 11 వరకు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

దేవాదాయ ఉద్యోగ, అర్చక సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నిక

ఖమ్మంగాంధీచౌక్: రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉద్యోగ, అర్చక సంఘం రాష్ట్ర నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. ఖమ్మంలోని శ్రీ గుంటు మల్లేశ్వర స్వామి దేవాలయంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఉడతనేని రామారావు, ఉపాధ్యక్షులుగా ఉప్పల శ్రీనివాసశర్మ, పీవీ.రమణారావు, ప్రధాన కార్యదర్శిగా తోటకూర వెంకటేశ్వర్లు ఎన్నికయ్యారు. అలాగే, సహాయ కార్యదర్శులుగా బి.మురళి, ఎస్.విశ్వనాథశర్మ, సలహాదారుగా పి.ప్రవీణ్‌కుమార్, సాంస్కృతిక విభాగం ప్రతినిధిగా ఐ.శ్రీనివాసరావు, కోశాధికారిగా కె.రామశర్మతో పాటు గౌరవ అధ్యక్షుడిగా కొడమంచలి రాధాకృష్ణశర్మ ఎన్నికయ్యారని సంఘం బాధ్యులు వెల్లడించారు.

అదుపు తప్పి లారీ బోల్తా



బోల్తా పడిన లారీ ఇదే..

బూర్గంపాడు: పాత సారపాక మూలమలుపు వద్ద బుధవారం తెల్లవారుజామున అదుపు తప్పి లారీ బోల్తా పడగా డ్రైవర్, క్లీనర్ స్వల్పంగా గాయపడ్డారు. జగదల్‌పూర్ నుంచి రాజమండ్రికి గోధుమల లోడుతో వెళ్తున్న లారీ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో బోల్తా పడింది. ఈ ఘటనలో గాయపడిన డ్రైవర్, క్లీనర్‌లను స్థానికులు భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని గోధుమలను ఎవరూ తీసుకెళ్లకుండా చర్యలు చేపట్టారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య



నారాయణరాజు మృతదేహం

కొత్తగూడెంరూరల్: మద్యానికి బానిసై, ఇంట్లో వారు మందలించారనే కారణంతో పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య పాల్పడ్డాడు. లక్ష్మీదేవిపల్లి పోలీసుల కథనం ప్రకారం.. బూడిదగడ్డకు చెందిన గోరంట్ల నారాయణరాజు(50) వెల్డింగ్‌షాపులో పని చేసేవాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. కుటుంబసభ్యులు మందలించడంతో మంగళవారం రాత్రి ఇంట్లో నుంచి బయటకు వెళ్లి హేమచంద్రాపురం రైల్వే ట్రాక్ పక్కన పొలాల్లో పురుగుల మందు తాగి మృతి చెందాడు. స్థానికులు గుర్తించి సమాచారం అందించగా, ఘటనా స్థలానికి వెళ్లిన పోలీసులు.. నారాయణరాజు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఘటనపై కేసు నమోదు చేశారు.

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,438

నేడు సీతారామ పంప్‌హౌస్ ట్రయల్ రన్!

కసరత్తు చేస్తున్న అధికారులు



ట్రయల్‌రన్‌కు సిద్ధమైన పంప్‌హౌస్ మోటార్లు

అశ్వాపురం: మండల పరిధిలోని బీజీ కొత్తూరు గ్రామంలో సీతారామ ప్రాజెక్ట్ ఫేస్-1 పంప్‌హౌస్ ట్రయల్ రన్‌కు జలవనరుల శాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గురువారం ఓ విద్యుత్ మోటారు ట్రయల్ రన్ ద్వారా నీరు ఎత్తిపోసేందుకు ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ట్రయల్ రన్ విజయవంతమైతే అధికారికంగా కార్యక్రమం చేపట్టనున్నారు. ఈనెల 13న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సీతమ్మ సాగర్ బ్యారేజీని, సీతారామ ప్రాజెక్ట్ పంప్‌హౌస్‌ను, కెనాల్‌ను సందర్శించారు. పంప్‌హౌస్‌లో డిప్యూటీ సీఎం, మంత్రులు ప్రత్యేక పూజలు చేసి విద్యుత్ సరఫరా ప్రక్రియను ప్రారంభించారు. గత పది రోజులుగా ఈఈ వెంకటేశ్వరరావు, డీఈ శ్రీనివాసరావు, ఏఈల ఆధ్వర్యంలో ట్రయల్‌రన్ ప్రక్రియ పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. పంప్‌హౌస్‌లో ఆరు మోటార్లు ఉన్నాయి. దుమ్ముగూడెం ఆనకట్ట నుంచి గ్రావిటీ కెనాల్ ద్వారా గోదావరి నీరు బీజీకొత్తూరు పంప్‌హౌస్ వరకు రాగా పంప్‌హౌస్ ద్వారా నీరు ఎత్తిపోయనున్నారు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా 70.40 టీఎంసీల నీరు 9000 క్యూసెక్కుల ప్రవాహంతో ఎత్తిపోయనున్నారు.

మూడేళ్ల క్రితం పూర్తయిన పనులు..

బీజీ కొత్తూరులో సీతారామ ప్రాజెక్ట్ ఫేజ్-1 పంప్‌హౌస్‌కు 2017 ఏప్రిల్ 25న అప్పటి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. నాలుగేళ్లలో పనులు పూర్తి చేశారు. దీంతో మూడేళ్ల క్రితమే డ్రై రన్‌కు సిద్ధమైంది. అయితే డ్రై రన్ చేస్తే విద్యుత్ బిల్లులు రూ.లక్షల్లో చెల్లించాల్సి వస్తుందని గత ప్రభుత్వం ఆ ప్రక్రియ చేపట్టలేదు. పంప్‌హౌస్‌కు విద్యుత్ కనెక్షన్ కూడా ఇవ్వలేదు. పంప్‌హౌస్ డ్రై రన్ చేసినా ఒక్క ఎకరాకు నీరు అందించే పరిస్థితి లేదు. నూతన కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస రెడ్డి సీతారామ ప్రాజెక్ట్ పనులపై ప్రత్యేక దృష్టి సారించారు. పలుమార్లు ప్రాజెక్ట్ పనులను సందర్శించి అధికారులతో సమీక్షలు నిర్వహించి పనుల వేగవంతానికి ఆదేశాలు జారీ చేశారు. ఆగస్టు 15 వరకు జిల్లాలో సీతారామ ప్రాజెక్ట్ ద్వారా సాగునీరు అందించాలనే లక్ష్యంతో పనులు వేగవంతంగా చేపడుతున్నారు. డిప్యూటీ సీఎం, మంత్రుల ఆదేశాలతో బీజీకొత్తూరు పంప్‌హౌస్ ట్రయల్ రన్‌కు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

రామచంద్రయ్య కుటుంబానికి అండగా ఉంటాం...

- రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- స్థలం, ఆర్థికసాయంపై కలెక్టర్‌కు సూచనలు



పద్మశ్రీ రామచంద్రయ్య కుటుంబీకులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



ఎమ్మెల్యే పాయం తల్లి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి, నాయకులు

మణుగూరు టౌన్: కంచుమేళం డోలు వాయిద్యకారుడు పద్మశ్రీ సకిని రామచంద్రయ్య మృతి బాధాకరమని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఇటీవల గొంతు సంబంధిత వ్యాధితో బాధపడుతూ మృతి చెందిన మణుగూరు మండలం కూనవరానికి చెందిన రామచంద్రయ్య నివాసంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. ఈసందర్భంగా కుమారుడు బాబురావు ప్రభుత్వం నుంచి రావాల్సిన నజరానా, ఇంటి స్థలం, ఇతర సదుపాయాలపై విన్నవించగా అక్కడి నుంచే కలెక్టర్‌తో మాట్లాడి మంత్రి పూర్తి వివరాలతో ఫైల్ పంపించాలని సూచించారు. ఈ విషయమై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలయ్యేలా కృషి చేస్తానని తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు ముత్తినేని సుజాత, తుళ్లూరి బ్రహ్మయ్య, దేవీప్రసన్న,దొబ్బల వెంకటప్పయ్య, గుడిపూడి కోటేశ్వరరావు, పీరినాకీ నవీన్, శివ సైదులు, సామా శ్రీనివాస రెడ్డి, గణేశ్‌రెడ్డి, సుబ్బారెడ్డి, కొర్సా ఆనంద్, పుచ్చకాయల శంకర్, కేవీరావు, గాండ్ల సురేశ్, వరలక్ష్మి, కనకలక్ష్మి, గోరంట్ల కనకనయ్య పాల్గొన్నారు. అలాగే, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తల్లి రాములమ్మ ఇటీవల మృతి చెందగా ఎమ్మెల్యేను మంత్రి తుమ్మల పరామర్శించారు. అలాగే, ఢిల్లీలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ఫోన్‌లో ఎమ్మెల్యే వెంకటేశ్వర్లును పరామర్శించారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్ నాయక్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ రాజ్ కుమార్, డీఐఓ బాలాజీ నాయక్ సైతం ఎమ్మెల్యేను పరామర్శించి మాట్లాడారు.

8న రైతు సంఘం జిల్లా మహాసభ



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

భద్రాచలంఅర్బన్: దుమ్ముగూడెం మండలంలోని గంగోలులో వచ్చేనెల 8న రైతు సంఘం జిల్లా రెండో మహాసభ నిర్వహిస్తున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా తెలిపారు. భద్రాచలంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల విశ్వనాథం అధ్యక్షతన బుధవారం జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సమస్యలపై చర్చించి కార్యాచరణ రూపొందించేందుకు నిర్వహిస్తున్న మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. అనంతరం భద్రాచలంలోని ఆటో డ్రైవర్ల అడ్డాను పరిశీలించి కార్మికుల సమస్యలు తెలుసుకున్నారు. రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి బ్రహ్మం, నాయకులు కల్లూరు వెంకటేశ్వరరావు, చంద్ర నరేంద్ర, నరాటి ప్రసాద్, రావులపల్లి రవికుమార్, సరెడ్డి పుల్లారెడ్డి, వీశంశెట్టి పూర్ణచంద్రరావు, కిలిమి ఎల్లారెడ్డి, మండపాటి సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రీజియన్‌లో 620 బస్సులు

నేలకొండపల్లి: ఖమ్మం రీజియన్‌లో ఏడు ఆర్టీసీ డిపోల నుంచి 620 బస్సుల ద్వారా ప్రయాణికులకు గమ్యస్థానాలకు చేరవేస్తున్నట్లు రీజినల్ మేనేజర్ అజ్మీరా సరిరామ్ వెల్లడించారు. నేలకొండపల్లి బస్టాండ్‌ను బుధవారం తనిఖీ చేసిన ఆయన బస్టాండ్‌లోకి బస్సులు వస్తున్నాయా, లేదా అని ఆరా తీశారు. చాన్నాళ్ల తర్వాత ఆవరణలోకి బస్సులు వస్తున్నందున ప్రయాణికులు వినియోగించుకోవాలని సూచించారు. అలాగే, బస్టాండ్‌లో చెత్తాచెదారం తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆర్‌ఎం మాట్లాడుతూ రీజియన్‌లోని ప్రయాణికుల్లో 50శాతం మేర మహాలక్ష్మి ద్వారా ప్రయాణిస్తున్నారని తెలిపారు. రద్దీకి అనుగుణంగా అవసరమైన రూట్లలో అదనపు బస్సులు నడిపిస్తున్నామని చెప్పారు. కాగా, సంస్థకు ఆదాయం సమకూర్చేందుకే ఆర్టీసీ పరిధిలోని ఖాళీ స్థలాలను నిబంధనలకు అనుగుణంగా లీజ్‌కు ఇస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఖమ్మం డిపో మేనేజర్ శ్రీనివాసరావు, అసిస్టెంట్ మేనేజర్ రామయ్య పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో జీవితం అంధకారం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి భానుమతి



సదస్సులో మాట్లాడుతున్న భానుమతి

సుజాతనగర్: మత్తు పదార్థాల వినియోగంతో జీవితం అంధకారం అవుతుందని, డ్రగ్స్, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ధన్వంతరీ ఫార్మసీ కళాశాలలో బుధవారం జరిగిన న్యాయ చైతన్య కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. యువతకు బాధ కలిగినప్పుడు మత్తు పదార్థాలకు అలవాటు పడి దాన్ని వ్యసనంగా మార్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవితం గడపాలని సూచించారు. విద్యార్థి దశలో క్రమశిక్షణ కలిగి చెడు అలవాట్లకు లోను కాకుండా ఉండాలని, ఉన్నత లక్ష్యాలతో అత్యున్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. అనంతరం మత్తు పదార్థాలకు దూరంగా ఉంటామని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ చైర్మన్ డాక్టర్ సి.రాజ్యలక్ష్మి, కొత్తగూడెం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, న్యాయవాదులు పురుషోత్తమరావు, నిరంజన్ రావు, కళాశాల చైర్మన్ డాక్టర్ ఎ.భాస్కర్, ఎస్సై జుబేదా బేగం, ప్రిన్సిపాళ్లు డాక్టర్ రామకోటేశ్వర రావు, డాక్టర్ జి. నాగరాజు, సీనియర్ న్యాయవాది మెండు రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

జీవితాన్ని నాశనం చేసుకోవద్దు..

మాదక ద్రవ్యాలకు అలవాటు పడి బంగారు జీవితాన్ని నాశనం చేసుకోవద్దని కొత్తగూడెం డీఎస్పీ షేక్ అబ్దుల్ రెహమాన్ అన్నారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థి దశలో ధూమపానం, మద్యం సేవించడం, హెరాయిన్, గంజాయి, గుట్కా, వంటి మత్తు పదార్థాలకు అలవాటు పడితే జీవితం నాశనం అవుతుందని హెచ్చరించారు. వీటికి దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి.దయాకర్, చుంచుపల్లి, త్రీ టౌన్ సీఐలు రాయల వెంకటేశ్వర్లు, సుజాతనగర్, చుంచుపల్లి ఎస్సైలు జుబేదాబేగం, ప్రవీణ్ పాల్గొన్నారు.

చవితి వేడుకల నిర్మాణం కూల్చివేత



కూల్చివేసిన రేకుల పందిరి

ఇల్లెందురూరల్: మండలంలోని బాలాజీనగర్ గ్రామ పంచాయతీ పరిధి సంజయ్‌నగర్‌లో వినాయక చవితి వేడుకల కోసం స్థానికులు నిర్మించిన రేకుల పందిరిని స్థానికుడైన కృష్ణమూర్తి, ఆయన కుటుంబ సభ్యులు బుధవారం కూల్చివేశారు. పందిరి నిర్మించిన స్థలం తమదని, ఏళ్ల క్రితం కొనుగోలు చేశామంటూ కృష్ణమూర్తి వాదిస్తుండగా.. దశాబ్దాలుగా ఇదే స్థలంలో వినాయకచవితి ఉత్సవాలు నిర్వహిస్తున్నందున ఆలయ నిర్మాణానికి తొలుత పందిరి వేశామని స్థానికులు చెబుతున్నారు. ఇరువర్గాల మధ్య కొనసాగుతున్న వివాదంపై ఇప్పటికే అధికారులకు ఫిర్యాదు సైతం చేశారు. ఈ నేపథ్యాన బుధవారం పొక్లెయినర్ సాయంతో కృష్ణమూర్తి కుటుంబం పందిరిని కూల్చివేయడంతో స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఉద్యోగోన్నతి పొందిన హెచ్‌ఎస్‌జీలకు పోస్టింగ్

ఖమ్మంగాంధీచౌక్: తపాలా శాఖలో లోయర్ సెకండరీ గ్రేడ్(ఎల్‌ఎస్‌జీ) పోస్ట్ మాస్టర్ నుంచి హయ్యర్ సెలక్షన్ గ్రేడ్(హెచ్‌ఎస్‌జీ)-2 పోస్ట్‌మాస్టర్‌గా ఉద్యోగోన్నతి పొందిన ఏడుగురికి బుధవారం పోస్టింగ్ కేటాయించారు. తెలంగాణ తపాలా సర్కిల్ కార్యాలయం పరిధిలో 120 మంది ఉద్యోగోన్నతి లభించగా, ఖమ్మం డివిజన్ పరిధిలో 11 మంది అవకాశం దక్కింది. వీరిలో ఏడుగురికి ఖమ్మం డివిజన్ పరిధిలో పోస్టింగ్ కేటాయిస్తూ డివిజన్ సూపరింటెండెంట్ రవికుమార్ ఉత్తర్వులు జారీచేశారు. ప్రస్తుతం వైరా సబ్ పోస్టాఫీస్‌లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్‌వీఎల్.ప్రసన్నను కొత్తగూడెం హెడ్ పోస్టాఫీస్‌కు, మణుగూరులో పనిచేస్తున్న పి అంజయ్యను ఖమ్మం కలెక్టరేట్‌కు, మధిర సబ్ పోస్టాఫీస్ నుంచి పి.యలమందను ఖమ్మం గాంధీచౌక్ సబ్ పోస్టాఫీస్‌కు, ఖమ్మం ట్రంక్ రోడ్ సబ్ పోస్టాఫీస్ లో పనిచేస్తున్న వి.వెంకయ్యను భద్రాచలం హెడ్ పోస్టాఫీస్‌కు కేటాయించారు. అలాగే, ఖమ్మం ఎన్ఎస్‌సీ క్యాంప్‌లో విధులు నిర్వర్తిస్తున్న బి.వీరన్నను ఇల్లెందు సబ్ పోస్టాఫీస్‌కు, ఖమ్మం మమతా హాస్పటల్ రోడ్ సబ్ పోస్టాఫీస్ నుంచి కె.శ్రీరాంను మధిర సబ్ పోస్టాఫీస్‌కు, ఖమ్మం ఇండస్ట్రియల్ ఏరియా సబ్ పోస్టాఫీస్ నుంచి కె.పాపయ్యను పాల్వంచ సబ్ పోస్టాఫీస్‌కు కేటాయిస్తూ ఉత్తర్వులు అందజేశారు.

ఐఈడీ పేలుడు కేసులో ఆరుగురు మావోల అరెస్ట్



అరెస్ట్ అయిన మావోయిస్టులతో పోలీసులు

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా - బీజాపూర్ సరిహద్దులో ఈనెల 23న జరిపిన ఐఈడీ పేలుడుకు సంబంధించి ఆరుగురు మావోయిస్టులను అరెస్ట్ చేసినట్టు సుక్మా ఎస్పీ కిరణ్ చవాన్ వెల్లడించారు. టేకుగూడ అటవీప్రాంతంలో మావోయిస్టులు అమర్చిన ఐఈడీ పేలడంతో ఇద్దరు కోబ్రా సైనికులు మృతి చెందారు. ఈమేరకు గాలింపు చేపట్టిన పోలీసు బలగాలను ఆరుగురు మావోయిస్టులను అరెస్ట్ చేసి భారీ ఎత్తున పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు.

వివాహిత అదృశ్యం..

పాల్వంచరూరల్: ఓ వివాహిత ఇంట్లో నుంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోవడంతో ఆమె బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పాల్వంచ మండలం ప్రభాత్‌నగర్‌కు చెందిన మెడికల్ రిప్రజెంటేటివ్ కేసాని నాగరాజుతో మహబూబాబాద్‌కు చెందిన భవానీకి రెండు నెలల క్రితం వివాహం జరిగింది. మంగళవారం అందరూ వ్యవసాయ పనులకు వెళ్లిన సమయాన ఆమె బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అశ్వారావుపేట మండలంలో...

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఊసిర్లగూడేనికి చెందిన వివాహిత ఈనెల 22వ తేదీన టైలర్ వద్దకు వెళ్లొస్తానని చెప్పి తిరిగి రాలేదు. ఎక్కడ వెదికినా ఆచూకీ లేకపోవడంతో ఆమె భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివరామకృష్ణ తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో యువకుడు మృతి

- పీహెచ్‌సీ వద్ద ఆందోళనకు దిగిన బంధువులు
- పంచాయతీ కార్యదర్శిపై దాడికి యత్నం



భద్రయ్య మృతదేహం



పంచాయతీ సెక్రటరీపై దాడికి యత్నిస్తున్న మహిళలు

అన్నపురెడ్డిపల్లి : విద్యుత్ షాక్‌కు గురై యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని కోయకట్టు గూడెంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన ఎరిదేశి భద్రయ్య (22) కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం గ్రామ పంచాయతీ మోటార్‌కు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు మద్దుకూరుకు చెందిన ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ రమేష్ భద్రయ్యను తీసుకెళ్లాడు. మోటార్‌కు విద్యుత్ కనెక్షన్ ఇచ్చే క్రమంలో భద్రయ్య విద్యుత్ వైర్లు చేతితో పట్టుకుని పైకి విసిరాడు. ఈ క్రమంలో అవి 11 కేవీ తీగలకు తాకడంతో భద్రయ్య విద్యుదాఘాతానికి గురయ్యాడు. వెంటనే ఎర్రగుంట పీహెచ్‌సీ తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని ధ్రువీకరించారు. విషయం తెలుసుకున్న భద్రయ్య కుటుంబసభ్యులు, గ్రామస్తులు భారీగా పీహెచ్‌సీ వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. అక్కడే ఒక గదిలో ఉన్న పంచాయతీ సెక్రటరీపై దాడికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, చండ్రుగొండ ఎస్సై రవి ఆందోళనకారులతో మాట్లాడి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ నిర్లక్ష్యం, పంచాయతీ సెక్రటరీ వల్లనే భద్రయ్య మరణించాడని, ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ గ్రామస్తులు, బంధువులు జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ ఎర్రగుంట చేరుకొని ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడి రాస్తారోకో విరమింపజేశారు.

విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి



విద్యుత్‌షాక్‌తో మృతి చెందిన గేదెలు

దమ్మపేట : విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతిచెందిన ఘటన మండల పరిధిలోని ముష్టిబండ శివారులో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన ఎస్‌కే.జావీద్‌పాషా గేదెలను మేపేందుకు శివారులోని బీడు భూముల్లోకి తీసుకెళ్లాడు. అక్కడ 11 కేవీ విద్యుత్ లైన్ తెగి కిందపడి ఉండగా ఎవరూ గమనించలేదు. కాగా, గడ్డి మేస్తూ ముందుకెళ్లిన రెండు గేదెలు ఆ తీగలకు తాకడంతో షాక్‌తో మృతిచెందాయి. వాటి విలువ రూ.80 వేలు ఉంటుందని, తనను ఆదుకోవాలని జావీద్ కోరుతున్నాడు.

అంగన్‌వాడీ కేంద్రంలో పాముల కలకలం



గ్రామస్తులు చంపిన పాములు

దుమ్ముగూడెం : మండలంలోని గంగోలు గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పాములు కలకలం రేపాయి. ఉదయం అంగన్‌వాడీ కేంద్రాన్ని తెరిచిన ఆయా గదులు శుభ్రం చేస్తుండగా రెండు పాములు కనిపించాయి. ఆమె కేకలు వేస్తూ బయటకు పరుగు తీయడంతో గ్రామస్తులు చేరుకుని రెండు పాములను చంపేశారు. వాటిలో ఒకటి తాచు పాము కాగా, మరొకటి పసర పాముగా గుర్తించారు. ఆ సమయంలో కేంద్రంలో పిల్లలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

పాల్వంచరూరల్ : నిషేధిత గుట్కా ప్యాకెట్లు విక్రయిస్తున్న దుకాణంపై పోలీసులు దాడి చేసి పట్టుకున్న ఘటన మండల పరిధిలోని బస్వతారకకాలనీలో బుధవారం చోటుచేసుకుంది. ప్రధాన రహదారి పక్కన గల డిస్పోజల్ గ్లాసులు, ప్లేట్లు విక్రయించే దుకాణంలో పోలీసులు తనిఖీ చేయగా రూ.95,980విలువైన పలు రకాల అంబర్ గుట్కా ప్యాకెట్లు లభించగా స్వాధీనం చేసుకున్నారు. దుకాణం యజమాని ముక్క శశాంక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.